క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: హెచ్ఎండీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట సెక్షన్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ బాలాజీ ఫీడర్ పరిధిలోని శంభీపూర్, మహేశ్వరం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలి



సుచిత్ర ప్రైడ్ అపార్ట్‌మెంట్ వాసులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న బీజేపీ జిల్లా నేత భరతసింహారెడ్డి

కుత్బుల్లాపూర్: పరిసరాలు శుభ్రంగా ఉంటే వ్యాధులు దరి చేరవని.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగస్వాములు కావాలని బీజేపీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి అన్నారు. సోమవారం జీడిమెట్ల డివిజన్ సుచిత్రలోని ప్రగతి ప్రైడ్ అపార్ట్‌మెంట్ రోడ్డులో కాలనీ వాసులతో కలిసి ఆయన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్లపై చెత్త చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. అనంతరం భరత సింహారెడ్డి మాట్లాడుతూ నివాసిత ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం కాలనీవాసులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో రాంబాబు, లక్ష్మణ్‌గౌడ్, సునీల్, రాహుల్, ధర్మ దత్తు, అజయ్‌కుమార్, యాదగిరి, శేషగిరిరావు, చంద్రశేఖర్, జయప్రకాష్, అమిత్, రతన్, శ్రీకాంత్, స్వామి రేఖ, చిల్డ్రన్ ఫ్రమ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

గణేష్ లడ్డూ రూ.10 లక్షలు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్ సెక్షన్ కాలనీలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన లడ్డూ వేలంపాటలో సర్పంచ్ ధరణి అంతిరెడ్డి రూ.10.08లక్షలకు దక్కించుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు సర్పంచ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి లడ్డూను అందజేశారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పవన్ తెలిపిన వివరాల ప్రకారం.. షాపూర్‌నగర్ వివేకానంద నగర్‌కు చెందిన ప్రదీప్‌కుమార్ గిరి(45), సరితాగిరి భార్యాభర్తలు. భార్య సరిత ఓ ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తుండగా ప్రదీప్ ప్రైవేట్ సంస్థలో అకౌంటెంట్‌గా పని చేస్తున్నాడు. ప్రదీప్ గత రెండేళ్లుగా వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకుని భార్య సరితను విడాకులివ్వాలని వేధిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇదే విషయంలో తనకు విడాకులు ఇవ్వాలని భార్య సరితతో గొడవపడ్డాడు. అనంతరం కింది పోర్షన్‌లోని వేరే గదిలోకి వెళ్లి ఫోన్‌లో గట్టిగా అరిచాడు. కొద్ది సేపటికి భార్య అనుమానం వచ్చి వెళ్లి చూడగా ప్రదీప్ ఫ్యాన్‌కు దోతితో ఉరి వేసుకుని కనిపించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని బస్తీ అభివృద్ధికి వినియోగించాలి



గురుమూర్తినగర్‌లో కబ్జాకు గురైన ప్రభుత్వ స్థలం వద్ద సమావేశమైన బస్తీవాసులు

రంగారెడ్డినగర్: ప్రభుత్వ స్థలాన్ని బస్తీ అభివృద్ధికి వినియోగించాలని.. ఆక్రమించేందుకు ప్రయత్నిస్తే సహించేది లేదంటూ రంగారెడ్డినగర్ డివిజన్ గురుమూర్తినగర్ వాసులు సోమవారం సదరు ప్రభుత్వ స్థలం వద్ద ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బస్తీ పెద్దలు మాట్లాడుతూ... గతంలో 80 గజాల ఖాళీ స్థలంలో ప్రభుత్వ మరుగుదొడ్లు ఉండేవన్నారు. కాలక్రమేణా అవి శిథిలం కావడంతో కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. ఓ మాజీ ప్రజాప్రతినిధి ఏకంగా పిల్లర్లు, బేస్మెంట్ వేయించి పూర్తిగా కబళించేందుకు యత్నిస్తున్నారన్నారు. కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణం కోసం కార్పొరేటర్ నిధులు మంజూరు చేశారన్నారు.

◆ ఆక్రమణదారులు సదరు స్థలాన్ని ఖాళీ చేస్తే కమిటీ హాలుతో పాటు బస్తీ దవాఖానా ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందన్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమణ విషయంలో సర్కిల్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బస్తీ ప్రజలకు న్యాయం చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో పెరిక శివకుమార్, ఎండీ ఉస్మాన్, నర్సింగరావు ముదిరాజ్, క్రాంతియాదవ్, తారకరాణి, రహింఖాన్, శివ, సయ్యద్ ఆరీఫ్, సయ్యద్ అజార్, జావిద్, నవీన్, అర్జున్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

మా దారి అడ్డదారి.!





రోడ్డు దాటేందుకు వాహనదారులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. షాపూర్‌నగర్–గాజుల రామారం చౌరస్తాలో సిగ్నల్స్ సమీపంలో వాహనదారులు డివైడర్‌ను దాటుతూ ప్రమాదకర ప్రయాణం సాగిస్తున్నారు. చౌరస్తాలో కొద్ది దూరంలోనే యూటర్న్ ఉన్నప్పటికీ ఓపిక పట్టలేని కొందరు ఇలా వెళ్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలకు తూట్లు పొడుస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు సృష్టిస్తున్నారు. సమీపంలోనే ట్రాఫిక్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నా డివైడర్లు దాటడం గమనార్హం.

– రంగారెడ్డినగర్



షాపూర్‌నగర్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి సమీపంలో రోడ్డుకు అడ్డంగా వెళ్తూ..

మహాత్ముడికి ఘన నివాళి

కుత్బుల్లాపూర్: అహింస మార్గం ద్వారా దేనినైనా సాధించవచ్చని మహాత్మా గాంధీ నిరూపించారని, భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడంతో ఆయన సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. సోమవారం గాంధీ జయంతి వేడుకలను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాపూజీ చూపిన అహింస మార్గంలో ప్రతి ఒక్కరూ పయనించాలని వక్తలు కోరారు.

వాడవాడలా గాంధీ జయంతి వేడుకలు



గాంధీనగర్‌లో జరిగిన కార్యక్రమంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్



జగద్గిరిగుట్టలో నివాళులర్పిస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, గూడ ఐలయ్యగౌడ్



షాపూర్‌నగర్‌లో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నేత కూన శ్రీశైలంగౌడ్



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి



కొంపల్లి మున్సిపాలిటీలో చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కౌన్సిలర్లు, మాజీ ఎంపీపీ కవిత



శంభీపూర్‌లోని కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు



భౌరంపేట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భూపతిరెడ్డి, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి



గాజులరామారంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డి



కొంపల్లిలో పీఏసీఎస్ చైర్మన్ గరిసె నరేందర్‌రాజు, బూర్గుబావి సత్యనారాయణ

గిరిజనులకు సంక్షేమానికి కేంద్రం కృషి

నిజాంపేట్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గిరిజనులకు సంక్షేమానికి కృషి చేస్తోందని.. అందులో భాగంగానే ములుగు జిల్లాలో గిరిజనుల వనదేవతలు సమ్మక్క–సారక్కల పేరుతో గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారని బీజేపీ గిరిజన మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రనాయక్ అన్నారు. రాష్ట్రానికి గిరిజన యూనివర్సిటీని ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం గిరిజన మోర్చా ఆధ్వర్యంలో ప్రగతినగర్‌లోని అల్లూరి సీతారామరాజు సర్కిల్‌లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రాష్ట్రంలో తాగుడుకు పెద్దపీట వేస్తూ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ప్రధాని నరేంద్రమోదీ రూ.900 కోట్లతో గిరిజన యూనివర్సిటీకి రూపకల్పన చేశారన్నారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేస్తున్న ఏకైక ప్రభుత్వం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు ఆకుల సతీష్, రాష్ట్ర మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి సులోచన, సీనియర్ నాయకుడు దొంతి శిల్పారెడ్డి, రాష్ట్ర ఎస్సీ మోర్చా దాసి నాగరాజు, మల్కాజ్‌గిరి పార్లమెంట్ కో.కన్వీనర్ డాక్టర్ ఎమ్ఆర్ఎస్ రాజు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

జన్మదిన శుభాకాంక్షలు

సుభాష్‌నగర్: కుత్బుల్లాపూర్ మండల మాజీ ఎంపీపీ సన్న కవిత జన్మదిన వేడుకలు సోమవారం కొంపల్లిలోని ఆమె నివాసంలో ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దూలపల్లికి చెందిన దేవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో మహేష్‌యాదవ్, యాదగిరియాదవ్, మధుయాదవ్ పాల్గొన్నారు.



మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తాం

కుత్బుల్లాపూర్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సోమవారం నగరానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు కొంపల్లి మున్సిపాలిటీని నుంచి మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణిదేవేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో ర్యాలీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాగమణిదేవేందర్ మాట్లాడుతూ... మైనంపల్లి హన్మంతరావు సారథ్యంలో మేడ్చల్, మల్కాజ్‌గిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ జెండాలను ఎగుర వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి పీఏసీఎస్ చైర్మన్ గరిసె నరేందర్‌రాజు, కొంపల్ల మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్, మాజీ వార్డు సభ్యుడు సన్న శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మైనంపల్లికి స్వాగతం పలికేందుకు వెళ్తున్న మాజీ సర్పంచ్ జెమ్మి నాగమణిదేవేందర్

బీజేపీ నాయకులపై ప్రభుత్వం కక్ష సాధింపు

దుండిగల్: బీఆర్ఎస్ ప్రభుత్వం తాము చేసే తప్పులను కప్పిపుచ్చుకునేందుకే బీజేపీ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రాష్ట్ర హోంమంత్రి పర్యటన నేపథ్యంలో బీజేపీ నేతలను ముందస్తు అరెస్ట్ చేశారు. దుండిగల్ మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు మల్లేశ్ యాదవ్, నేతలు పీసరి కృష్ణారెడ్డి, రాహుల్ తదితరులను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మల్లారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని వారికి మద్దతు తెలిపారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రభుత్వ, బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలు ఏర్పాటు చేసిన ప్రతిసారి బీజేపీ నేతలను అక్రమంగా అరెస్ట్ చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అనినారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. మరోసారి ఈ విధంగా ప్రవర్తిస్తే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వేలాది మంది డబుల్ బెడ్‌రూమ్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటే కొందరికే ఇళ్ల పట్టాలను అందజేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అందరికీ న్యాయం చేస్తామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి

బూమ్స్ అకాడమీ మాస్టర్ కృష్ణకు ప్రతిభ పురస్కారం

కుత్బుల్లాపూర్: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చి ఉత్తమ ఫలితాలు తీసుకొస్తున్న బూమ్స్ అకాడమీ మాస్టర్ ఎల్.కృష్ణ మహాత్మాగాంధీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ అవార్డు అందుకున్నారు. సోమవారం నగరంలోని శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో సిరాజ్ డాన్స్– ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల కార్యక్రమంలో మాస్టర్ కృష్ణకు ప్రతిభ పురస్కారం అందజేశారు. గత 20 సంవత్సరాలుగా కుత్బుల్లాపూర్‌లో కరాటే, స్కేటింగ్ ×స్పోర్ట్స్‌లలో ఎంతోమంది విద్యార్థులను రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దుతున్న మాస్టర్ ఎల్.కృష్ణ సేవలకు ఈ అవార్డు దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవార్డుతో తనకు మరింత బాధ్యత పెరిగిందని తప్పకుండా రాబోయే రోజుల్లో మరింత మందిని శిక్షణ ఇప్పించి తెలంగాణ రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తామన్నారు.



ప్రతిభ పురస్కారం అందుకుంటున్న మాస్టర్ కృష్ణ

మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

కుత్బుల్లాపూర్: జర్నలిస్టులకు రక్షణ చట్టాన్ని, మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయా లని టీయూడబ్ల్యూజే కుత్బుల్లాపూర్ అధ్యక్షుడు కోటగడ్డ శ్రీనివాస్ అన్నారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం జీడిమెట్ల గ్రామంలో గాంధీ విగ్రహానికి జర్నలిస్టులు వినతి పత్రాన్ని అందజేసి నిరసన తెలియజేశారు.

◆ ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మాట్లాడుతూ ఇటీవల పాత్రికేయులపై ఆడులు పెరిగిపోయాయని అన్నారు. దీనిని ఏజేయూ ఖండిస్తుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధులుగా ఉన్నటువంటి జర్నలిస్టులకు భద్రత కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఈ విషయంలో చొరవ చూపి రక్షణ చట్టాలన్ని అమలు చేయాలన్నారు. మీడియా కమిషన్ ఏర్పాటు చేయడంతో పాటు అక్రిడేటెడ్ జర్నలిస్టులకు వెంటనే రైల్వే పాస్‌లను పునరుద్ధరించాలని కోరారు.

◆ జర్నలిస్టులపై కక్షపూరితంగా వ్యవహరిస్తూ దాడులకు పాల్పడే వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ సీనియర్ పాత్రికేయుడు వెంకట్ రెడ్డి, జిల్లా నాయకులు దయాకర్, నాగేంద్ర చారి, నరేందర్ రాజ్, ట్రెజరర్ శేషారెడ్డి, ఎల్లారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, నర్సింహులు, కల్కి మూర్తి, సైదులు, దత్తు, గ్రంథాలు, నాగరాజు, నాగరాజు, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

అధికారంలోకి వచ్చాక

మరో లక్ష ఇళ్లు నిర్మిస్తాం

'డబుల్'ఇళ్ల పంపిణీలో హోంమంత్రి మహమూద్ అలీ



లబ్ధిదారులకు పట్టా అందజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

దుండిగల్: భారతదేశానికి జాతిపిత మహాత్మా గాంధీ అయితే తెలంగాణ జాతిపిత కేసీఆర్ అని హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో నిర్వహించిన మూడో విడత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిజాంపేట, బాచుపల్లి, కైసర్‌నగర్ ప్రాంతాల్లో నిర్మించిన 3,142 డబుల్ బెడ్‌రూమ్‌లను కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, సనత్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు మంత్రి అందజేశారు. ఇళ్ల పట్టాలను పంపిణీ చేసే సమయంలో వారితో కాసేపు ముచ్చటించారు.

◆ ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున డబుల్ బెడ్‌రూమ్‌లు నిర్మించలేదన్నారు. గతంలో అప్పటి గవర్నర్ నరసింహన్ సికింద్రాబాద్‌లో పర్యటించిన సమయంలో ఢిల్లీలోని ఐఏఎస్ అధికారుల క్వార్టర్స్ కంటే డబుల్ బెడ్ రూమ్‌లే బ్రహ్మాండంగా ఉన్నాయని కితాబిచ్చారని గుర్తు చేశారు. ఇప్పటి వరకు లక్ష ఇళ్లు నిర్మించామని, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చాక మరో లక్ష ఇళ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు.

రైతుబంధు, బీమా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

కేసీఆర్ 14 ఏళ్ల పాటు పోరాటం చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి బంగారు తెలంగాణ నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. రైతులకు రెండు పర్యాయాలు రుణ మాఫీ, ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని అన్నారు.కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, జోనల్ కమిషనర్ మమత, నిజాంపేట మేయర్ నీలారెడ్డి, దుండిగల్, కొంపల్లి మున్సిపల్ చైర్మన్లు కృష్ణవేణి, శ్రీశైలం యాదవ్, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రూ.500 మించని పింఛన్

బీజేపీ పాలిస్తున్న ఏ రాష్ట్రంలో కూడా రూ.500కు మించి పింఛన్ ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆసరా పింఛన్ కింద వృద్ధాప్య, వితంతువులకు రూ.2వేలు, వికలాంగులకు రూ.4వేలకు పైగా ఇస్తోందన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా రూ.లక్ష చెక్కును అందజేస్తూ నిరుపేద కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు.

50ఏళ్లలో కాంగ్రెస్ చేసిందేమీ లేదు..

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలిచినంత మాత్రాన తెలంగాణ రాష్ట్రంలో హవా కొనసాగుతుందని భ్రమ పడుతుందన్నారు. అక్కడ ముస్లిం ఓటర్లు బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్‌కు వేశారన్నారు. తెలంగాణలో ముస్లింలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని చెప్పారు. 50 ఏళ్ల చరిత్రలో కాంగ్రెస్ పార్టీ చేసిందేమి లేదని, తొమ్మిదిన్నర ఏళ్లలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించిందన్నారు.

పోలీసు వ్యవస్థ పటిష్టం...

పోలీసు వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారా నక్సలిజం, మత కలహాలు, అల్లర్లు పూర్తిగా తగ్గిపోయి ప్రజలంతా సోదరభావంతో మెలుగుతున్నారని అన్నారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసులు పని చేస్తున్నారని అభినందించారు.

